# అనగనగా ఒక కథ

## రాజయ్య ఇడ్లీ బండి

జ్ఞం

**వంటమనిషి యాదమ్మ "కూతురుకి.. కానుపైందని ఓ 15 రోజులు రాలే"నని చెప్పింది! "సర్లేమ్మా" అని ఓ 1500 రూపాయలు ఇచ్చి పంపించాడు జగన్నాధరావు.**

**"దబ్బుకి ఇబ్బందిపడకు..ఏవన్నా అవసరమొస్తే కబురెట్టు"**

"అలాగే అయ్యగారూ" దణ్ణం పెట్టి "మీకు ఎలా గడుస్తుందో ఏంటో. తప్పని స్థితిలో వెళ్తున్నాను"

"ఏం పర్లేదు-మనవణ్ని ఎత్తుకో- మురిసిపో- ఆ తర్వాత రా!"

జగన్నాధరావు ఆత్మీయంగా మాట్లాడతాడు. తన దగ్గర పనిచేసే వాళ్లని ఆదరంగా చూసుకోవటం ఆయనకి వంశంలో వచ్చిన లక్షణం.

వందల ఎకరాల పొలంతోబాటు ఆతని తల్లితండ్రులు వెలకట్టలేనంత మంచి హృదయం ఇచ్చారు.

నేడో రేపో పాతికేళ్ల 'పెళ్లి రోజు' జరుపుకుందామనుకుంటూండగా అన్నపూర్ణ కైలాసం వెళ్లిపోయింది.

జమిందారురుగారి భార్య.. సాక్షాత్తూ అన్నపూర్ణమ్మ పోయారని ఊరంతా విలపించింది!

ఆయనకి ఎవరూ లేరు. ఏకాకిగా మిగిలిపోయాడు.

'ఎవరూ లేకపోవడమేంటి మేమందరం లేమూ' అనుకుంది ఊరంతా.

కానీ ఆయన దగ్గరకెళ్లి 'బాబూ ఏటన్నా కావాల్నా?' అని అడగడానికి జగన్నాధరావు మామూలు మనిషి కాడు. కోటీశ్వరుడు- 'ఏం కావాలన్నా ఆయనే ఆర్డర్ చేయాలి..చేయించుకోవాలిగానీ మనం అడక్కూడదు' అనుకున్నారంతా.

యాదమ్మ ఆ ఇంట్లో పనిమనిషి- అన్నపూర్ణ వెళ్లిపోగానే "బాబుగారు- అమ్మగారి వంటలు నేను రుచి చూసాను. ఆవిడ పాళ్లూ.. పాకం- మీ ఇష్టాలూ నాకు బాగా తెల్సు. మీరు సరే అంటే నేను వంట చేసి పెడతాను" అంది యాదమ్మ!

జగన్నాధరావుకి స్టవ్ వెలిగించడం కూడా రాదు! యాదమ్మకి పనిమనిషి నుంచి వంట మనిషిగా ప్రమోషనిచ్చాడు.

ఆవేళ్టినుంచి ఆమెని 'యాదమ్మతల్లీ' అని పిలుస్తున్నాడు.

ఇప్పుడు సెలవుపెట్టింది.

"ఇంకో వంటావిణ్ని, చూడమంటారా" అన్నాడు పెద్దపాలేరు రంగడు.

"వద్దురా.. మనం ఓ రుచికి అలవాటుపడ్డాం! కొత్తవాళ్లొస్తే మనకి ఏ కూర ఎలా వండితే ఇష్టమో చెప్పడానికి మనకావిద్యరాదు- ఏదో హోటల్నుంచి కారియర్ తెప్పించుకుందాం- పొద్దున్నే కాస్త టిఫిను- మధ్యాహ్నం పెరుగన్నం- రాత్రి చపాతి ఇలా అనుకున్నా- బైట చెత్త నూనెలూ, తుప్పు గిన్నెల్తో వండుతార్రా! అయినా మన యాదమ్మతల్లి ఏవేవో పచ్చళ్లు చేసి ఫ్రిజ్‌లో పెట్టిందిట- ఏ రోజేం తినాలో లిస్టు రాసిందిట- మనకేం ప్రోబ్లం లేదు- నువ్వెళ్లి నీకు నాకూ ఇడ్లీలు కట్టించుకురా- వేడిగా ఉండాల్రోయ్!"

* * *

"వార్నీ అది రాయిరా... ఇడ్లీలూ- ఏ హోటల్నుంచి తెచ్చావ్"

"బాగున్నాయన్నారుగా హోటల్ అడక్కండి"

"మీ ఇంట్లో చేయించి తెచ్చావు కదా" అన్నాడు జగన్నాధరావు.

"మీ మీదొట్టుగా మా ఇంట్లోవి కాదండీ- ఇదిగో మిగిలిన చిల్లర"

"ఎక్కడ కొన్నావ్"

"మన సందు చివర రాజయ్య ఇడ్లీ బండిమీద తెచ్చానండి. వాడు చాలా బాగా చేస్తాడని అందరూ అనుకుంటూంటారు" చెప్పడానికి ఇబ్బందిపడ్డాడు రంగడు.

"నిజంగా బావున్నాయిరా. రోజూ ఇవేతే- అవునూ నువ్వు తిన్నావా?"

"నాకు వాడు ఫ్రీగా ఇచ్చాడయ్యా?"

"ఫ్రీగానా.. ఎందుకు? నా పేరు చెప్పావా?" కోపం వచ్చింది జగన్నాధరావుకి.

"లేదండి. ఆయనకి ఓ పదిమందికి ఫ్రీగా ఇడ్లీ పేకెట్ ఇవ్వడం ఆనవాయితీటండి!"

"అరె చిత్రంగా ఉందే"

* * *


జగన్నాధరావు మార్నింగ్ వాక్‌లా పొలానికి నడిచే వెళ్తాడు- రంగడు కూడా వస్తాడు. ఇది రోజూ జరిగే కథే- ఆ మర్నాడు ఓ పెద్ద గుంపుని చూశాడు జగన్నాధరావు. "ఏంట్రా అది రంగా.. ఏదన్నా గొడవ అవుతోందా?"

"కాదయ్యా మన రాజయ్య ఇడ్లీ బండి" అన్నాడు రంగడు. జగన్నాధం ఆశ్చర్యపోయాడు.

"అది కాదురా.. దొమ్మి జరిగినట్లు అంతమంది జనం ఏంట్రా?"

"రాజయ్య ఇడ్లీ అలాంటిది అయ్యా"

**రాజయ్య ఇడ్లీ పొట్లాలుగా కట్టి వచ్చిన పిల్లలకి ఇస్తున్నాడు- వాళ్లెవళ్లూ డబ్బులు ఇవ్వట్లేదని గమనించాడు. నాలుగైదు పొట్లాలు ఫ్రీగానే వెళ్లిపోయినట్లు జగన్నాధరావు తెలుసుకున్నాడు.**



"నాక్కూడా ఆ దొమ్మిలో దూరి ఇడ్లీ కొనుక్కోవాలనుందిరా"

"నేను తెచ్చిపెడుతున్నాను కదయ్యా.. మీరక్కడికి వెళ్లకూడదు. ఎందుకు చెప్తున్నానో వినండి!"

"ఎందుకు వెళ్లకూడదురా?" జగన్నాథం అడిగాడు.

"మీలాంటి పెద్దోళ్లు వచ్చారంటే ఆయన కంగారుపడ్తారు- కష్టమర్లు కూడా పారిపోతారు. జమిందారుగారు స్వయంగా వచ్చారంటే ఆయన రేటు పెంచేస్తాడు. వద్దండీ పేదోళ్ల నోట్లో మట్టి కొట్టినవాళ్లం అవుతాం మనం" రంగడు జగన్నాధరావుగారి ఉత్సాహాన్ని అణచి చెప్పాడు.

కానీ జగన్నాధరావుగారి ఉద్రేకాన్ని అణచలేకపోయాడు.

★ ★ ★

జగన్నాధరావు మామూలు బట్టల్తో దర్జాలూ ఆర్భాటాలూ లేకుండా ఓ తలపాగా చుట్టుకుని ఇడ్లీ బండి దగ్గరికి వెళ్లాడు.

జమీందారు జగన్నాధరావుని ఎవ్వరూ గుర్తుపట్టలేదు.

"ప్లేటు ఇడ్లీ కావాలి" అని అడిగాడు.

ఇడ్లీబండి వోనర్ రాజయ్య- "ఒక్క ఛణం ఆగ్గలవా ఈ వాయంతా వేరే పిల్లలకి ఇవ్వాలి" అన్నాడు.

జగన్నాధరావు చూస్తూనే ఉన్నాడు.

రాజయ్య ఇడ్లీ పొట్లాలుగా కట్టి వచ్చిన పిల్లలకి ఇస్తున్నాడు- వాళ్లెవళ్లూ డబ్బులు ఇవ్వట్లేదని గమనించాడు. నాలుగైదు పొట్లాలు ఫ్రీగానే వెళ్లిపోయినట్లు జగన్నాధరావు తెలుసుకున్నాడు.

తలపాగాలో ఉన్న జమీందారుగారు తన బండి దగ్గరకి వస్తాడని రాజయ్య ఎప్పుడూ ఊహించలేదు. అయినా ఆ జమీందారుగార్ని అతడెప్పుడూ ప్రత్యక్షంగా చూడలేదు.

ఎవరో కొత్త కస్టమర్‌లా ఆ వాయి పిల్లలకే అని నిలబెట్టి రెండో వాయిలో జగన్నాధరావుకి ఇడ్లీ అందించాడు రాజయ్య.

అక్కడ తింటే వేడి వేడిగా ఇడ్లీ ఇంకా బాగుంది. అన్నపూర్ణ చేసినట్టుంది. యాదమ్మ చేతి వంటలా వుంది. రాజయ్య పరిశుభ్రంగానే ఇడ్లీలు చేస్తున్నాడు. తినదల్చుకున్న దానికన్నా రెండిడ్లీలు ఎక్కువే తిన్నాడు. వేడి వేడిగా బండి ముందే ఇడ్లీలు తింటుంటే ఎంత ఆనందంగా ఉందో. రాజయ్య ఇడ్లీ బండిని తన ఇంటి ముందు పెట్టెయ్యమంటే ఎంత బాగుంటుంది.

నెమ్మదిగా రాజయ్యని కబుర్లలోకి దింపాడు.

"ఇందాక పిల్లలకి ఇడ్లీ ప్యాకెట్లు ఫ్రీగా ఇచ్చావ్ దేనికి?"

"నీకెందుకయ్యా నీక్కూడా ఫ్రీగా కావాలా? వాళ్లు నాలా పెరుగుతున్న పిల్లలు. అమ్మ నాన్న లేనప్పుడు నేను అర ఇడ్లీ కోసం నానా అవస్థలు పడ్డాను. ఇవ్వాళ నేను ఎంచుకున్న పనివల్ల నాలుగు రూపాయలు మిగులుతున్నాయ్. ఎవరైనా అనాథ పిల్లలు కనిపిస్తే వాళ్ళకివ్వడానికి నా బండి మీద కొన్ని పొట్లాలు రడీగా వుంటాయి. నేను పెద్దగా దానధర్మాలు చేయలేనుగానీ చిన్నప్పటి నాకు, నేనే టిఫిన్ పెట్టుకున్న ఆనందం నాకు కలుగుతుంది" అన్నాడు రాజయ్య.

జగన్నాధరావు కళ్లలో నీళ్లు తిరిగాయ్.

"వెళ్లొస్తానయ్యా" అని వెనక్కి తిరగబోతుంటే.. రాజయ్య

"మీరెవరోగానీ డబ్బులియ్యకపోతే నేనొప్పుకోను. మాట్లాడుతూ మాట్లాడుతూ ఆరు ఇడ్లీలు తిన్నారు. మీలాటి వాళ్లిస్తే కదా స్వామీ- నేను, మా పిల్లలు తినగలం. మీకు ఫ్రీగా ఇడ్లీ ఇవ్వలేను. ఆరు రూపాయలిస్తారా?" అన్నాడు రాజయ్య.

ఆరు వందల రూపాయలు అతని చేతిలో పెట్టి "వందమందికి ఇడ్లీలు పంచవయ్యా" అంటూ జగన్నాధరావు కదిలిపోయాడు.

ఆయనెవరో రాజయ్యకి తెలీదు కానీ మర్నాడు రంగడు అయ్యగార్కి టిఫిన్ కొనడానికొచ్చినప్పుడు "ఈరోజు నా బండి దగ్గరకొచ్చిన వాళ్లందరికీ ఇడ్లీ ఫ్రీ అయ్యా. ఎవడో పెద్దమనిషి నిన్న వచ్చి ఆరొందలిచ్చి వందమందికి ఇడ్లీలు ఫ్రీగా ఇమ్మన్నాడు. డబ్బొద్దు- పట్టుకుపో" అన్నాడు రాజయ్య. ఆ విషయం విని జగన్నాధరావు ఆశ్చర్యపోయాడు.

☆